సాక్షి
కుమురం భీం

మంగళవారం । 23 । జూలై । 2024

ప్రాణహిత పరుగులు.. పెద్దవాగు ఉరకలు

మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ప్రాణహిత పరుగులు పెడుతోంది. ప్రాణహితతోపాటు పెద్దవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. పెంచికల్‌పేట్ మండలం నందిగామ వద్ద ఈ రెండు నదులు కలిసి సంగమంగా ఏర్పడి చూపరులకు కనువిందు చేస్తున్నాయి.

- పెంచికల్‌పేట్



న్యూస్‌రీల్

'మహిళా శక్తి' యూనిట్లు ప్రారంభించాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్: మహిళాశక్తి పథకంలో పొందుపర్చిన యూనిట్లను గుర్తించి వెంటనే ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం డీఆర్‌డీవో సురేందర్‌తో కలిసి సహాయ ప్రాజెక్టు మేనేజర్లు, స్త్రీనిధి, బ్యాంకు అధికారులతో మహిళా శక్తి పథకం యూనిట్ల నిర్వహణకు అర్హత కలిగిన మహిళా సంఘాల గుర్తింపు, యూనిట్ల ప్రారంభంపై సమీక్ష నిర్వహించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మహిళాశక్తి పథకంలో డెయిరీ యూనిట్లు, కోళ్లు, చేపల పెంపకం, ఎంటర్‌ప్రైజెస్ వంటి యూనిట్ల నిర్వహణకు అర్హత కలిగిన మహిళా సంఘాలను గుర్తించాలన్నారు. సమావేశాలు నిర్వహించి సభ్యులకు అవగాహన కల్పించాలని సూచించారు. లక్ష్యాల ప్రకారం సంఘాలను గుర్తించేందుకు సీసీలు, ఏపీఎంలు చర్యలు తీసుకోవాలన్నారు. అదనపు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రామకృష్ణ, డీపీఎంలు, ఏపీఎంలు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన ఆర్టీసీ డీఎం



ఎస్పీ శ్రీనివాసరావును సన్మానిస్తున్న ఆర్టీసీ డీఎం విశ్వనాథ్

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలో ఎస్పీ డీవీ శ్రీనివాసరావును సోమవారం ఆర్టీసీ డీఎం విశ్వనాథ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆర్టీసీ బస్టాండ్‌లో గుర్తు తెలియని వ్యక్తులు పిక్‌పాకెటింగ్ పాల్పడుతున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ప్రయాణికుల భద్రత కోసం పోలీసు సిబ్బందిని నియమించాలన్నారు. శాలువాతో సత్కరించి మొక్క అందించారు.

అడ.. అస్తవ్యస్తం!

- ప్రాజెక్టు నిర్వహణ, మరమ్మతులకు నిధులు కరువు
- ఆనకట్ట దెబ్బతిని రెండేళ్లయినా పట్టింపేది..?
- పాలిథిన్ కవర్లతో కప్పి చేతులు దులుపుకొంటున్న అధికారులు
- భారీ వర్షాల నేపథ్యంలో ఆందోళనలో ప్రజలు



ప్రాజెక్టు ఆనకట్టపై కప్పిన కవర్లు

ఆసిఫాబాద్‌రూరల్: కుమురంభీం(అడ) ప్రాజెక్టు నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ఓ వైపు భారీ వర్షాలు కురుస్తుండటంతో ఆనకట్ట ప్రమాదకరంగా మారుతోంది. అధికారులు కట్టపై కేవలం ప్లాస్టిక్ కవర్లు కప్పి చేతులు దులుపుకొన్నారు. పనులన్నీ పూర్తికాకుండా కాంట్రాక్టర్ చేతులేత్తేయగా.. అధికారులు నిర్వహణ గాలికొదిలేశారనే ఆరోపణలు వస్తున్నాయి. సోమవారం ప్రాజెక్టు నీటి మట్టం 237.6 అడుగులకు చేరుకుంది. ఇన్‌ఫ్లో 300 క్యూసెక్కులు ఉండగా.. ఒక గేటును ఎత్తి నీటిని కిందికి వదులుతున్నారు. అవుట్‌ఫ్లో 320 క్యూసెక్కులుగా ఉంది.

రూ.450 కోట్ల వ్యయం

ఆసిఫాబాద్ మండలంలో అడ గ్రామం వద్ద 10 టీఎంసీల సామర్థ్యంతో 45 వేల ఎకరాలకు సాగు నీరందించాలనే ఉద్దేశంతో రూ.450 కోట్లతో నవయుగ నిర్మాణ సంస్థ కుమురంభీం(అడ) ప్రాజెక్టు నిర్మాణం చేపట్టింది. 2009 పనులు ప్రారంభం కాగా 2011లో ఆనకట్ట పనులు పూర్తి చేశారు. అయితే ప్రాజెక్టు పనులు నాసిరకంగా చేపట్టడంతో 2022 జూలైలో కురిసిన వర్షాలకు ఆనకట్ట కృంగి బీటలు వారింది. వరద ఉధృతికి కుడివైపు చివరి భాగంలో 700 నుంచి 990 మీటర్ల మధ్య దెబ్బతింది. రాళ్లు, మట్టి కొట్టుకుపోయి బలహీనంగా మారింది. నీటి తాకిడికి కుంగిపోయింది. ఇంజినీరింగ్ అధికారులు పాలిథిన్ కవర్లు తెప్పించి దెబ్బతిన్న ప్రాంతాల్లో కప్పించారు. ఆ తర్వాత హడావుడిగా సాంకేతిక బృందంతో ఆనకట్ట పటిష్టత, మట్టి నాణ్యతపై పరీక్షలు నిర్వహించారు. వర్షాలు తగ్గిన తర్వాత పూర్తిస్థాయి మరమ్మతులు చేపట్టాలని నిర్ణయించినా ఇప్పటికీ ముందుడుగు పడలేదు. ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో ప్రాజెక్ట్ నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది.

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం

ఆనకట్ట దెబ్బతిన్న ప్రాంతంలో నిపుణుల కమిటీతో జియో, సాంకేతిక పరీక్షలు నిర్వహించాం. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి కూడా తీసుకెళ్లాం. ఆదేశాలు మేరకు మరమ్మతులు చేపడతాం.

– నవ్య, ప్రాజెక్టు జేఈఈ

5.904 టీఎంసీలే నిల్వ

10 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో ప్రాజెక్టు నిర్మించినా ఆనకట్ట దెబ్బతినడంతో 5.904 టీఎంసీలకు మించి నీటిని నిల్వ చేయడం లేదు. వరద వస్తున్నా గేట్లు ఎత్తి నీటిని కిందికి వదులుతున్నారు. కుడి కాలువ ద్వారా ఆసిఫాబాద్ మండలంలో ఆరు వేల ఎకరాలు, ఎడమ కాలువ ద్వారా వాంకిడి మండలంలో 39,500 ఎకరాలకు సాగునీరందించాల్సి ఉంది. ప్రస్తుతం ప్రాజెక్టు మిషన్ భగీరథ నీటి సరఫరా, చేపల పెంపకం కోసం మాత్రమే ఉపయోగపడుతోంది. అంతేకాక నీటి నిల్వకు అవకాశం లేకపోవడంతో ప్రాజెక్టు నుంచి విడుదల చేసే నీటికి కింద ఉన్న వాగులో వరద పెరిగి పంటలు మునుగుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వాంకిడి మండలం గుండా వెళ్లే ఎడమ కాలువ 65 కిలోమీటర్ల పొడవున విస్తరించి ఉంది. నవేగూడ, ఇందాని, ఖిరిడి, సరాండి, వాంకిడి, ఖమాన, జంబుల్‌ధరి, లక్ష్మీపూర్, వెల్గీ, ఖేడెగాం, కనర్‌గాం గ్రామ పంచాయతీల మీదుగా ఆసిఫాబాద్ మండలం భీంపూర్, గుండి, తదితర గ్రామాలతోపాటు కాగజ్‌నగర్ మండలంలోని పలు వ్యవసాయ క్షేత్రాలకు సాగు నీరందాల్సి ఉంది. కాలువ వెంట పిచ్చి మొక్కలు, చెత్తాచెదారం, పూడిక పేరుకుపోయింది. చిన్న వాంకిడి సమీపంలో రివిట్‌మెంట్ దెబ్బతింది.

అక్టోబర్ నాటికి మరమ్మతులు

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే



ప్రాజెక్టు ఆనకట్టను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, అధికారులు

ఆసిఫాబాద్‌రూరల్: అక్టోబర్ నాటికి కుమురంభీం(అడ) ప్రాజెక్టుకు మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి సోమవారం మండలంలోని అడ ప్రాజెక్టు కుంగిన కట్టను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం కాలువలు ఎక్కడి వరకు పూర్తయ్యాయో అక్కడి వరకు సాగు నీరందిస్తున్నట్లు తెలిపారు. ప్రాజెక్టు వద్ద పరిస్థితిని సమీక్షించేందుకు ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో కలెక్టరేట్‌లో ప్రత్యేక టోల్‌ఫ్రీ నంబర్ 63046 86505, 08733279033 అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. అనంతరం స్థానిక పీహెచ్‌సీని సందర్శించి వివరాలు వివరాలు తెలుసుకున్నారు. పర్యాటక శాఖ ఏర్పాటు చేసిన బోటింగ్ పాయింట్ పరిశీలించారు. వందరోజుల్లో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రాజెక్టు ఈఈ గుణవంతరావు, తహసీల్దార్ శ్రీనివాసరావు, తదితరులు ఉన్నారు.

అసెంబ్లీలో ప్రస్తావిస్తా..



2009లో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో అడ ప్రాజెక్టు పనులు నాసిరకంగా చేసి వదిలేశారు. ఇది రైతులకు శాపంగా మారింది. నాసిరకం పనులతో ఆనకట్ట కుంగింది. ప్రాజెక్టులో నీరున్నా రైతులకు ఉపయోగపడటం లేదు. రాష్ట్రప్రభుత్వం వెంటనే ప్రాజెక్టు మరమ్మతులకు రూ.5 కోట్ల నిధులు కేటాయించాలి. అడ ప్రాజెక్టు విషయాన్ని అసెంబ్లీలో ప్రస్తావిస్తా.

– కోవ లక్ష్మి, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే

రూ.లక్ష వరకు నష్టం



వాంకిడి: రెండేళ్ల క్రితం వచ్చిన వరదలకు గ్రామ సమీపంలో కాలువకు భారీ గండి పడింది. ఏపుగా పెరిగిన పంట కొట్టుకుపోవడంతో సుమారు రూ.లక్ష వరకు నష్టం వచ్చింది. మరమ్మతులు చేపట్టినా మళ్లీ అదే ప్రాంతంలో కాలువ దెబ్బతింది. ఈ ఏడాది మళ్లీ వరదలు వస్తే కాలువ కొట్టుకుపోవడం ఖాయం.

– వసాకె లక్ష్మణ్, చిన్న వాంకిడి

నామమాత్రపు మరమ్మతులు



వాంకిడి: మూడేళ్లుగా కాలువకు నామమాత్రపు మరమ్మతులు చేపడుతూ అధికారులు చేతులు దులుపుకొంటున్నారు. ఏటా సమస్య పునరావృతం అవుతోంది. అనేక ప్రాంతాల్లో రివిట్‌మెంట్ పనులు చేపట్టాల్సి ఉంది. పూడిక, పిచ్చిమొక్కలు పెరిగి ఉన్నాయి. ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలి.

– కోట్నాక భీంరావు, జంబుల్‌ధరి

తాగునీటికి ప్రాణాలు పణం

- వరద నీటిలో పీకలగుండం గ్రామస్తుల సాహసం



చెలిమనీటిని తెచ్చుకుంటున్న గ్రామస్తులు

దహెగాం(సిర్పూర్): ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులో తాగునీటి కోసం వారు ప్రాణాలను పణంగా పెడుతున్నారు. మనిషి మునిగిపోయేంతా లోతు వరద నుంచి వెళ్లి చెలిమ నీటిని తెచ్చుకుంటున్నారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా దహెగాం మండలం పీకలగుండం గ్రామంలో 80 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. ఇక్కడ చేతిపంపులు పని చేయడం లేదు. కాగజ్‌నగర్ మండలం అందవెల్లి వద్ద పెద్దవాగు వంతెనపై నుంచి పైప్‌లైన్ పనులు ఇంకా పూర్తి కాలేదు. ఈ కారణంగా మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోయి 20 రోజులు దాటింది. ఎర్రవాగు ఒడ్డున రక్షిత తాగునీటి పథకం ఉన్నా మోటారు చెడిపోయి ఐదు రోజులవుతుంది. దీంతో నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గుక్కెడు తాగునీళ్ల దొరక్క అల్లాడుతున్నారు. స్థానిక ఎర్రవాగులో వరద ప్రవాహం ఎక్కువగా ఉంది. అయినా వాగులో ఇసుక మేటలపై చెలిమలు తవ్వి నీటిని తెచ్చుకుంటున్నారు. ఇక కాలకృత్యాలు తీర్చుకునేందుకు వాననీటిని పట్టుకుంటున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

భక్తిశ్రద్ధలతో నటరాజ హోమం



హోమంలో పాల్గొన్న కళాకారులు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని ఈజ్‌గాం శివమల్లన్న ఆలయంలో సోమవారం నటరాజ స్వామి హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. హోమ కార్యక్రమంలో డ్యాన్స్ మాస్టర్ డోంగ్రి సంతోష్, రాకేశ్, డ్యాన్స్ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పట్టణాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దుతాం

- కాగజ్‌నగర్ మున్సిపల్ కమిషనర్ అంజయ్య
- సమస్యలు విన్నవించిన పట్టణవాసులు
- 'సాక్షి' ఫోన్ ఇన్‌కు స్పందన



ఫోన్ ఇన్‌లో మాట్లాడుతున్న కాగజ్‌నగర్ మున్సిపల్ కమిషనర్ అంజయ్య

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ పట్టణాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దుతామని మున్సిపల్ కమిషనర్ అంజయ్య అన్నారు. పారిశుధ్య నిర్వహణ, సీజనల్ వ్యాధుల నియంత్రణ చర్యలపై 'సాక్షి' సోమవారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహించిన ఫోన్ ఇన్‌కు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. కాగజ్‌నగర్ పట్టణంలోని రోడ్లు గుంతలమయంగా మారాయని, మురుగునీటి కాలువల దుస్థితి, పిచ్చికుక్కల బెడద, తదితర సమస్యలను ప్రజలు కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యలపై సమాధానం ఇస్తూ.. సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.

ప్రశ్న: వార్డు నం.1 ఎఫ్‌కాలనీలో పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. పాములు, తేళ్లు ఇళ్లలోకి వస్తున్నాయి. పిచ్చిమొక్కలు వెంటనే తొలగించాలి.

– ప్రతాప్, వార్డు నం.1 ఎఫ్ కాలనీ

కమిషనర్: త్వరలోనే పిచ్చిమొక్కలు తొలగిస్తాం. ఇంటి పరిసరాల్లో చెత్తాచెదారం లేకుండా ప్రజలు చూసుకోవాలి.

ప్రశ్న: బాలాజీనగర్‌లో రోడ్లు గుంతలమయంగా మారాయి. వర్షపు నీరు నిలిచి ప్రమాదాలు జరుగుతున్నాయి. మార్కెట్‌కు వెళ్లే దారిలో గుంతలు ఉండటంతో మహిళలు ఇబ్బంది పడుతున్నారు. ప్రమాదాలు జరిగితే అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుంది.

– మార్త సత్యనారాయణ, ఎల్లాగౌడ్, బాలాజీనగర్

కమిషనర్: త్వరలోనే గుంతలకు ప్యాచ్‌వర్క్ చేపడతాం. రోడ్డు నిర్మాణం కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం.

ప్రశ్న: కాగజ్‌నగర్‌లో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. పట్టణం గ్రామీణ ప్రాంతాల కంటే అధ్వానంగా తయారైంది. ఏ కాలనీలో చూసినా మురికి నీరు రోడ్లపై చేరుతుంది. ఇటీవల కురిసిన వర్షానికి వరదంతా ఇళ్లలోకి చేరింది. అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలి. పటిష్టమైన డ్రెయినేజీ వ్యవస్థ కోసం అనుభవమైన అధికారులతో ప్రణాళికలు రూపొందించాలి.

– ఎమ్మాజీ సంతోష్, మున్నూరు కాపు సంఘం నాయకుడు

కమిషనర్: పట్టణాభివృద్ధి కోసం కౌన్సిల్‌లో చర్చించాం. నిధుల కోసం ఇటీవల మున్సిపల్ సెక్రటరీని కౌన్సిలర్లు కలిశారు. తాము కూడా నిధుల మంజూరు కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం.

ప్రశ్న: న్యూకాలనీలోని ప్రధాన రహదారికి ఒకవైపు మాత్రమే స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు. మరోవైపు నిర్మించలేదు. ప్రమాదాలు జరుగుతున్నాయి. న్యూకాలనీలో రోడ్లు కూడా గుంతలమయంగా మారాయి. నీరు చేరి బురదమయంగా మారుతున్నాయి.

– కలికోట రమణయ్య, న్యూకాలనీ

కమిషనర్: త్వరలోనే స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేస్తాం. ఏయే ప్రాంతంలో బ్రేకర్లు అవసరమున్నాయో పరిశీలించి స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేస్తాం. రోడ్లకు మరమ్మతులు చేపడతాం.

ప్రశ్న: వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం నుంచి సరస్వతీదేవి దేవాలయం వరకు మురుగునీటి కాలువ లేకపోవడంతో నీరంతా రోడ్డు పైనే పారుతోంది. ఇంటి ముందు నిలుస్తోంది. ఎన్నోసార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు.

– గజ్జి ప్రసాద్, కాపువాడ

కమిషనర్: వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం నుంచి మసాలా ఒర్రె వరకు నాలా నిర్మించేందుకు అధికారులకు ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరు కాగానే మురుగునీటి కాలువ నిర్మాణం చేపడతాం.

ప్రశ్న: 15 రోజులుగా మున్సిపల్ వాటర్ రావడం లేదు. కాలనీలోని ప్రభుత్వ బోర్‌వెల్ చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగాయి.

– పురుషోత్తం, రిటైర్డ్ ఎస్సై, గంగారాంబస్తీ

కమిషనర్: ప్రతిరోజూ తాగునీరు వచ్చేలా చర్యలు తీసుకుంటాం. బోర్‌వెల్ చుట్టూ పెరిగిన పిచ్చిమొక్కలను తొలగిస్తాం.

ప్రశ్న: పట్టణంలో రోడ్లు, మురుగునీటి కాలువలు కబ్జాకు గురవుతున్నాయి. మున్సిపల్ వర్కర్స్‌కు చెత్త తొలగించడం కూడా కష్టంగా మారుతోంది. రాజీవ్‌గాంధీ చౌరస్తా నుంచి సంజీవయ్య కాలనీ వరకు అప్పటి ఆసిఫాబాద్ సబ్ కలెక్టర్ దిగంబర్ రోడ్డు ఆక్రమణలను తొలగించారు. మళ్లీ ఆక్రమణదారులు యథావిధిగా ప్రధాన రోడ్డు ఆక్రమించుకుని షెడ్లు నిర్మించారు. రోడ్లపైనే కూరగాయలు, పండ్ల వ్యాపారులు అమ్మకాలు సాగిస్తుండటంతో అంబులెన్స్ కూడా వెళ్లలేని పరిస్థితి. అధికారులు ఆక్రమణలు తొలగించాలి. రెగ్యులర్ టీపీఎస్ లేక అనుమతులు లేకుండా భవనాలు నిర్మించుకుంటున్నారు. స్టేషన్ రోడ్డు, బాలాజీనగర్, కొసర్‌మజీద్ తదితర కాలనీల్లో పైపులైన్‌లకు లీకేజీలు ఉన్నాయి.

– ముంజం ఆనంద్ కుమార్

కమిషనర్: మున్సిపల్ స్థలాల్లో ఆక్రమణలకు పాల్పడితే చర్యలు తీసుకుంటాం. రోడ్లను ఆక్రమించే వారిని గుర్తించి తొలగిస్తాం. పైపులైన్ లీకేజీలు సరిచేస్తాం. అనుమతులు లేకుండా భవనాలు నిర్మించినట్లు తమ దృష్టికి వస్తే కూల్చివేస్తాం.

ప్రశ్న: పట్టణంలో కుక్కల బెడద తీవ్రంగా ఉంది. కుక్కలు దాడులు చేయకముందే అధికారులు స్పందించాలి. గణేష్ మందిర్‌కు వెళ్లే దారి బురదమయంగా మారుతుంది.

– శివప్రసాద్ నాయర్, వార్డు నం.28

కమిషనర్: గతంలో కుక్కలను పట్టుకుని వేరే ప్రాంతానికి తరలించాం. కుక్కల బెడదను తగ్గించేందుకు చర్యలు తీసుకుంటాం. రోడ్లు గుంతలమయంగా ఉన్న చోట కంకర, మొరం వేసి బాగు చేస్తాం.

ప్రజల సమస్యలు పరిష్కరించాలి

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే
- ప్రజావాణిలో అర్జీలు స్వీకరణ



సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్: ప్రజల సమస్యలను సంబంధిత అధికారులు వేగంగా పరిష్కరించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి సోమవారం వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని హడ్కో కాలనీకి చెందిన రాపోలు పద్మావతి వితంతు పింఛన్ మంజూరు చేయాలని అర్జీ సమర్పించింది. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో బురదగూడ చెరువు కట్ట తెగి ఎనిమిదెకరాల పత్తి పంటలో ఇసుక మేటలు వేసి రూ.3 లక్షల నష్టం వాటిల్లిందని, నష్ట పరిహారం చెల్లించాలని కోరుతూ కాగజ్‌నగర్ మండలం బారెగూడకు చెందిన విజయ నిర్మల వేడుకుంది. వట్టివాగు ప్రాజెక్టులో ముంపునకు గురైన పట్టా భూమికి బదులుగా తుంపెల్లి శివారులో భూమి కేటాయించాలని కోరుతూ ఆసిఫాబాద్ మండలం తుంపెల్లికి చెందిన బోరుంట సంపత్ దరఖాస్తు చేసుకున్నాడు. దివ్యాంగ పింఛన్ మంజూరు చేయాలని రెబ్బెన మండలం కిష్టాపూర్‌కు చెందిన గోమాస శంకర్ విన్నవించాడు. దివ్యాంగ ధ్రువీకరణ పత్రంలో తప్పులు సవరించాలని కాగజ్‌నగర్‌కు చెందిన షేక్ అబుత్సల దరఖాస్తు చేసుకున్నాడు. సిర్పూర్(టి) మండలం లక్ష్మీపూర్‌లోని వ్యవసాయ భూమికి విద్యుత్ కనెక్షన్ ఇప్పించాలని మండల కేంద్రానికి చెందిన జమీల్ హుస్సేన్ కోరాడు. పెంచికల్‌పేట్ మండలం చేడ్వాయికి చెందిన కిర్కరి రాజన్న గ్రామశివారులోని పట్టా భూమికి కొలతలు చేపట్టి హద్దులు నిర్ణయించాలని దరఖాస్తు చేసుకున్నాడు. క్షేత్రస్థాయిలో దరఖాస్తులు పరిశీలించి సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

తొమ్మిది నెలలుగా పెండింగ్



వారసత్వంగా సంక్రమించిన నాలుగెకరాల పైచిలుకు భూమిని నా కుమారుడి పేరుతో విరాసత్ చేయాలని దరఖాస్తు చేసుకున్నాను. మీసేవ కేంద్రంలో స్లాట్ బుక్ చేసుకున్నాను. తొమ్మిది నెలలుగా తహసీల్దార్ పెండింగ్‌లో పెట్టారు. దీనిపై విచారణ చేపట్టి పట్టా మార్పిడి చేయాలి.

– దాహగావకర్ హొక్కు, కౌటాల

వాటా ఇప్పించాలి



మా గ్రామంలో తండ్రి నుంచి సంక్రమించిన ఐదెకరాల భూమిని నా సోదరుడు ఒక్కడే అక్రమంగా పట్టా మార్పించుకున్నాడు. నాకు రావాల్సిన వాటా 2.5 ఎకరాలు ఇప్పించి న్యాయం చేయాలి.

– మావల్కర్ కొండయ్య, జైభీమ్‌నగర్, సిర్పూర్(టి)

వేతనాలు చెల్లించాలి



పెండింగ్ వేతనాలు చెల్లించాలని తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు మొరేశ్, కార్యదర్శి శ్రీకాంత్ కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఆసిఫాబాద్ గ్రామ పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా మారి ఆరు నెలలవుతున్నా మున్సిపల్ చట్టం ప్రకారం కార్మికులకు వేతనాలు చెల్లించడం లేదు. పీఎఫ్ చెల్లిస్తూ యూనిఫాం అందించాలి. వారానికి ఒకరోజు సెలవు ఇవ్వాలి.

నమ్మించి.. నట్టేటా ముంచి!

- రూ.15 కోట్లకుపైగా వసూలు?
- ఇటీవల బాధితులకు ఐపీ నోటీసులు
- బ్యాంకు సర్వీస్ పాయింట్ నిర్వాహకుడిపై కేసు

సాక్షి, ఆసిఫాబాద్: బడా వ్యాపారులు, మధ్యతరగతి వారిని బుట్టలో వేసుకుని రూ.కోట్లు వసూలు చేసి ఓ వ్యక్తి ఐపీ పెట్టిన ఘటన జిల్లాలో చర్చనీయాంశమైంది. కొందరు బాధితులు గత నెల 26న కాగజ్‌నగర్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఈ ఘటన వెలుగు చూసింది. రంగు ప్రశాంత్ కాగజ్‌నగర్‌లోని ఆదర్శ్‌నగర్ కాలనీలో నివసిస్తున్నాడు. రాజీవ్‌గాంధీ చౌరస్తాలోని ఓ ప్రముఖ బ్యాంకు పక్కన అదే బ్యాంకుకు చెందిన సర్వీస్ పాయింట్ పెట్టాడు. నమ్మకంగా ఉండటంతో చాలామంది రూ.లక్షల నుంచి రూ.కోట్ల వరకు డబ్బులు వడ్డీకి ఇచ్చినట్లు తెలుస్తోంది. పట్టణానికి చెందిన 12 మంది డిపాజిట్‌దారులు తమ బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని అతనికి రూ.40 లక్షలకు పైగా ఇవ్వగా.. జమ చేయకుండా అతడు చేతులెత్తేయడంతో పంచాయితీ పోలీసుస్టేషన్‌కు వెళ్లింది. బాధితులకు బ్యాంకు చెక్కులు ఇవ్వడంతో అప్పట్లో విషయం సద్దుమణిగింది. చెక్కులన్నీ బౌన్స్ కావడంతో బాధితులు మళ్లీ పోలీసులను ఆశ్రయించగా అప్పటికే అతడు పరారీ కావడం గమనార్హం.

200 మందికి పైగా బాధితులు

ఈ నెల 1న కాగజ్‌నగర్‌లోని 43 మందికి రంగు ప్రశాంత్ ఐపీ నోటీసులు పంపడంతో రూ.కోట్లలో జరిగిన మోసం బయటపడింది. అధికారికంగా ఐపీ నోటీసుల్లో రూ.40 వేల నుంచి రూ.45 లక్షల వరకు ప్రజల నుంచి డబ్బులు తీసుకున్నట్లు వెల్లడవుతుండగా.. అనధికారికంగా మోసపోయిన వారి సంఖ్య 200లకు పైగా ఉన్నట్లు సమాచారం. మొత్తం రూ.1.75 కోట్లు అధికారికంగా వసూలు చేశాడు. అనధికారికంగా ఓ మద్యం వ్యాపారి ఒకరు రూ.50 లక్షలు, స్టీల్ షాప్ యజమాని రూ.50 లక్షలు, ఓ టైలర్ రూ.50 లక్షలు, కాస్మోటిక్ ఏజెన్సీ యజమాని రూ.కోటి, మరో ఇద్దరు వ్యాపారులు రూ.50 లక్షల చొప్పున రూ.కోటి నిందితుడికి ఇచ్చినట్లు తెలుస్తోంది. ఇలా మొత్తం రూ.15 కోట్ల నుంచి రూ.20 కోట్ల వరకు వసూలు చేసినట్లు సమాచారం. ఆ డబ్బుతో అతను పట్టణంలో రూ.కోటి వరకు ఖర్చు చేసి ఓ ఇల్లు కట్టుకున్నట్లు తెలుస్తోంది. అలాగే కారు, లగ్జరీ బైక్ కొనుగోలు చేసి జల్సాలు చేసినట్లు సమాచారం. అయితే ఐపీ నోటీసుల్లో మాత్రం తన వద్ద టీవీ, టేబుల్, మంచం, నాలుగు కుర్చీలు, ఐదు స్టీల్ నీటి పాత్రలు, ఒక సెల్‌ఫోన్ మాత్రమే ఉన్నట్లు పేర్కొనడం గమనార్హం. ఐపీ నోటీసులు అందడంతో బాధితులు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు. సోమవారం నిందితుడి ఇంటిని తనిఖీ చేశారు.

ఓ అధికారి అండతోనే పరారీ..?

గత నెలలో రంగు ప్రశాంత్ విషయం వెలుగులోకి వచ్చిన వెంటనే పోలీసులు అతడిని స్టేషన్‌కు రప్పించినట్లు బాధితులు పేర్కొంటున్నారు. అయితే ఓ పోలీసు ఉన్నతాధికారి ఆదేశాలతో వారు చూసీచూడనట్లు వదిలేశారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆ ఉన్నతాధికారికి భారీ మొత్తంలో నిందితుడు సొమ్ము అందజేశాడనే ఆరోపణలు ఉన్నాయి.

తాగునీటిని సక్రమంగా సరఫరా చేయాలి

ఆసిఫాబాద్‌రూరల్: ప్రజలకు అంతరాయం లేకుండా సక్రమంగా తాగునీటిని సరఫరా చేయాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. మండలంలోని మాణిక్‌గూడ భగీరథ ఫిల్టర్ బెడ్‌ను ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి సోమవారం పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ మిషన్ భగీరథ ఫిల్టర్ బెడ్ ద్వారా రోజుకు 115 మిలియన్ లీటర్ల తాగునీటి సరఫరాకు అవకాశం ఉందన్నారు. ఆసిఫాబాద్, కాగజ్‌నగర్, బెల్లంపల్లి నియోజకవర్గాల పరిధిలోని 17 మండలాలు, 900 గ్రామాలకు తాగునీటి సరఫరా జరుగుతుందన్నారు. అనంతరం అడ అర్బన్ పార్క్‌ను సందర్శించారు. చిల్డ్రన్స్ పార్కుగా అభివృద్ధి చేసేందుకు ఐటీడీఏ నిధులు వినియోగించుకోవాలని సూచించారు. వారి వెంట డీఈ ఇర్ఫాన్ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

గుట్కా పట్టివేత



పట్టుకున్న గుట్కాతో పోలీసులు

చెన్నూర్: పట్టణంలోని కుమ్మరిబొగుడ కాలనీలో రూ.60 వేల విలువైన గుట్కా పట్టుకున్నట్లు సీఐ రవీందర్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు సోమవారం కాలనీకి చెందిన ముక్త శ్రీనివాస్, కొండమీది మధుకర్ ఇళ్లలో తనిఖీలు నిర్వహించగా గుట్కా ప్యాకెట్లు లభ్యమయ్యాయన్నారు. ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

మద్యం షాపులో చోరీ

జైనూర్: సిర్పూర్(యూ) మండలంలోని పిట్టగూడ చౌరస్తాలో ఉన్న మద్యం షాపులో ఆదివారం రాత్రి చోరీ జరిగినట్లు ఎస్సై మాధవ్ తెలిపారు. పిట్టగూడ చౌరస్తాలోని శ్రీసాయి మద్యం దుకాణంలో రూ.4,14,139 విలువైన మద్యంతో పాటు రూ.9 వేల నగదును అపహరించినట్లు ఆయన పేర్కొన్నారు. మద్యం దుకాణం గుమాస్తా బానోతు దయారం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

అల్లో నేరెడల్లో..



నోముకుంటున్న నూతన వధూవరులు

వేమనపల్లి: అల్లో నేరెడల్లో.. అంటూ మహిళలు రాగయుక్తంగా పాటలు పాడుతుండగా నూతన వధువరులు నేరెళ్ల నోము నోముకున్నారు. గ్రామాల్లో ఓ సామాజిక వర్గానికి చెందిన కొత్త జంటలు పెళ్లయిన ఏడాది లోపు నేరళ్ల నోము నోచుకుంటారు. నేరేడి కొమ్మ తెచ్చి పసుపు, కుంకుమ రాసి కంకణం కట్టి అలంకరిస్తారు. ఇప్ప పువ్వుతో పిండి వంటలు చేస్తారు. కొత్త దంపతులు మహిళలకు వాయినాలు ఇస్తారు. నిండునూరేళ్ల సుమంగళిగా ఉండాలని మహిళలు ఆశీర్వదిస్తారు.

బురదలో దిగబడిన 108



బురదలో దిగబడిన అంబులెన్స్

కోటపల్లి: మండలంలోని పార్‌పల్లి, లింగన్నపేట గ్రామాల లోతొర్రెపై ఇటీవల వంతెన నిర్మించగా అధికారుల నిర్లక్ష్యంతో కాంట్రాక్టర్ అప్రోచ్ రోడ్డు నిర్మాణంలో నాసిరకం మట్టివేసి తాత్కలిక రోడ్డు నిర్మాణం చేపట్టాడు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు మట్టిరోడ్డు పూర్తిగా బురదమయంగా మారి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం అత్యవసర నిమిత్తం 108 వాహనం లింగన్నపేట గ్రామానికి వెళ్తుండగా అప్రోచ్ రోడ్డు బురద రోడ్డులోనే దిగబడి పోయింది. దీంతో అంబులెన్స్ సిబ్బంది అతికష్టంపై బయటికి తీసుకొచ్చారు. ఇప్పటికైనా అధికారులు, ఎమ్మెల్యే దృష్టి సారించి 12 గ్రామాల ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుతున్నారు.

సర్కారు బడుల్లో శిక్షా సప్తాహ్

- వారం రోజులపాటు వివిధ కార్యక్రమాల నిర్వహణ
- విద్యార్థుల్లో వినోదం, విజ్ఞానం పెంచేలా ప్రత్యేక ప్రణాళిక



ప్రదర్శనలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఆదిలాబాద్‌టౌన్/మంచిర్యాలఅర్బన్/నిర్మల్‌ఖిల్లా: నూతన విద్యావిధానం అమలులోకి వచ్చి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా అన్ని సర్కారు బడుల్లో సోమవా రం నుంచి ఈనెల 29 వరకు శిక్షా సప్తాహ్ (విద్యా వారోత్సవాలు) నిర్వహిస్తున్నారు. వారం రోజుల పాటు రోజుకో విధంగా కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. ఇందుకోసం ప్రత్యేక ప్రణాళిక రూపొందించారు. బోధనకు ఆటంకం కలుగకుండా కార్యక్రమాలు నిర్వహించాలని అధికా రులు ఉపాధ్యాయులను ఆదేశించారు. అయితే ఈ కార్యక్రమాలకు సంబంధించి తీసిన ఫొటోలకు జియో ట్యాగింగ్ చేయాలని సూచించారు. వీటిని గూగుల్ డ్రైవ్‌లో అప్‌లోడ్ చేయాలని సమగ్ర శిక్షా అభియాన్ అధికారులు పేర్కొంటున్నారు. విద్యార్థుల్లో వినోదంతో పాటు విజ్ఞానం పెంపొందించేలా కార్యక్రమాలు రూపొందించేందుకు చర్యలు చేపడుతున్నారు.

రోజువారీ కార్యక్రమాలు ఇవే..

శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా రోజుకో విధమైన కార్యక్రమాన్ని చేపడుతున్నారు. ఇందులో భాగంగా సోమవారం ఉమ్మడి జిల్లాలోని ఆయా పాఠశాలల్లో నీటిని ఆదా చేయడం, ఇతరులకు సహాయం చేయాలనే అంశంపై టీఎం మేళా నిర్వహించారు. ఇందులో భాగంగా ఆహారం, కూరగాయలు, వ్యర్థాలతో బొమ్మల తయారీని చార్ట్‌ల రూపంలో ప్రదర్శించారు.

- 23న పాఠశాలల్లో అమలు చేస్తున్న న్యూమరసీ ఫండమెంటల్ లిట్రసీ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించనున్నారు. ఎఫ్‌ఎల్‌ఎన్ కార్యక్రమానికి సంబంధించి ఉపాధ్యాయుల బోధన పద్ధతులను ప్రదర్శించనున్నారు. సదస్సులు నిర్వహించి విద్యార్థులకు కథలు చెప్పాల్సిఉంటుంది.
- 24న క్రీడా దినోత్సవం నిర్వహించాలి. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో ఆటలు ఆడించడం, క్రీడలతో కలిగే ప్రయోజనాలు వివరించనున్నారు.జట్టు ఆడే ఆటల్లో ఫలితాలు విజయం దిశగా ఉంటాయని, క్రీడలతో మానసిక ఎదుగుదల, శారీరక దృఢత్వం గురించి తెలియజేయనున్నారు.
- 25న సాంస్కృతిక దినోత్సవం నిర్వహించాలి. ఇందులో భాగంగా వివిధ భాషలు, వేషధారణ, సంస్కృతి, సంప్రదాయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలి. వస్త్రధారణ, చిత్రలేఖనం, జానపద, నాటకాలు విద్యార్థులతో వేయించాలి. ఏకపాత్రాభినయం, పాటల పోటీలు నిర్వహించాలి.
- 26న సాంకేతిక నైపుణ్య దినోత్సవం నిర్వహించాల్సి ఉంది. ఇందులో కోడింగ్ ఛాలెంజ్, జీవ ధారణ కార్యక్రమాలు, పక్షు, జంతువులపై అవగాహన, విద్యార్థులకు చారిత్రక విషయాలను తెలియజేయడం, వర్క్‌షాప్ నిర్వహించాల్సి ఉంటుంది. విద్యార్థులను చారిత్రాత్మక ప్రదేశాలకు తీసుకెళ్లి వాటి గురించి వివరిస్తారు.
- 27న పాఠశాలల్లో పౌష్టికాహార దినోత్సవం నిర్వహించాలి. విద్యార్థులతో ఎకో క్లబ్‌లను ఏర్పాటు చేయాలి. క్లబ్‌ల ద్వారా పలు కార్యక్రమాలు నిర్వహించేలా చూడాలి. మొక్కల పెంపకం, కూరగాయల తోటల పెంపకం చేపట్టాలి. మొక్కలు నాటి వాటిని సంరక్షించేలా చూడాలి.
- 29న సామాజిక భాగస్వామ్య దినోత్సవం నిర్వహించాలి. అందర్నీ ఇందులో భాగస్వామ్యం చేయాలి. తల్లిదండ్రులు, దాతలను బడికి ఆహ్వానించి కార్యక్రమాలు చేపట్టాలి. పాఠశాలల్లో చేపడుతున్న కార్యక్రమాలు వివరించాలి. పాఠశాల అభివృద్ధిలో సమాజ భాగస్వామ్యం పెంపొందించేలా చర్యలు చేపట్టాలి.

ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు, విద్యార్థుల వివరాలు

జిల్లా	ప్రాథమిక	ప్రాథమికోన్నత	ఉన్నత	విద్యార్థులు
ఆదిలాబాద్	466	107	105	65,000
మంచిర్యాల	510	96	108	29,376
నిర్మల్	533	85	117	52,667
కుమురంభీం	560	102	58	36,000

తప్పనిసరిగా నిర్వహించాలి



జిల్లాలోని ప్రతీ పాఠశాలలో శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని తప్పనిసరిగా నిర్వహించాలి. ఈ నెల 22 నుంచి 29 వరకు వారం రోజుల పాటు రోజుకో కార్యక్రమాలను చేపట్టాలి. విద్యార్థులకు అవగాహన కల్పించాలి. అమ్మ ఆదర్శ కమిటీలను, తల్లిదండ్రులు, దాతలను ఈ కార్యక్రమాల్లో భాగస్వాముల్ని చేయాలి. నిర్వహించిన కార్యక్రమాలకు సంబంధించి ఫొటోలు, వీడియోలకు జియో ట్యాగింగ్ చేయాలి. నివేదికను పంపించాలి.

– ప్రణీత, డీఈవో, ఆదిలాబాద్

విద్యార్థుల భాగస్వామ్యం తప్పనిసరి...



'శిక్షా సప్తాహ' వారోత్సవాల్లో ప్రభుత్వ పాఠశాలల్లోని ప్రతీ విద్యార్థిని భాగస్వామ్యం చేసేలా ప్రోత్సహించాలి. రోజుకొక విభిన్న ఇతివృత్తంతో నిర్వహించే కార్యక్రమాల ద్వారా విద్యార్థులలో చైతన్యం రగిలించాలి. ఇందులో విద్యార్థులు సృజనాత్మకత, విభిన్న ఆలోచన శక్తిని పొందుతారు. ఏడు రోజులపాటు నిర్వహించే ఈ కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు విద్యార్థులకు మార్గ నిర్దేశం చేయాలి.

– డా.ఏ.రవీందర్‌రెడ్డి, డీఈవో, నిర్మల్

మంచిర్యాలలో..

గర్మిళ్ల పాఠశాలలో సోమవారం టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ దినోత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా వినూత్నంగా బోధన సామగ్రి తయారు చేయడం, సాంకేతిక పరిజ్ఞానాన్ని టీఎల్ఎంగా మలుచుకోవడంతో పాటు విద్యార్థులకు అర్థమయ్యేలా వివరించారు. ఆహారం–కూరగాయలు అనే అంశంపై ప్రయోగాత్మకంగా ప్రదర్శించారు.

స్మితా సబర్వాల్‌పై డీసీపీకి ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ దివ్యాంగులపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో సోమవారం డీసీపీ భాస్కర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివ్యాంగుల చట్టం ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో నాయకులు పెద్దపల్లి సత్యనారాయణ, ఇందూరి రమేశ్, రామ్ శ్రీనివాస్, దరావత్తు రాందాస్, దుర్గెట్టి లక్ష్మణ్, తదితరులు ఉన్నారు.

'ఏఐటీయూసీ ఆరోపణలు అర్థరహితం'

శ్రీరాంపూర్: కాంగ్రెస్ ప్రభుత్వంపై ఏఐటీయూసీ, సీపీఐ నాయకులు చేసిన ఆరోపణలు అర్థరహితమని ఐఎన్టీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచి ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు, కేంద్ర ఉపాధ్యక్షుడు కలవేన శ్యాం, నాయకులు భీంరావు, గరిగే స్వామి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయ హస్తం పథకం కింద పేద విద్యార్థులు సివిల్ సాధించేందుకు రూ.4 కోట్ల నిధులను సింగరేణి నుంచి కేటాయించడం జరిగిందన్నారు. ప్రభుత్వ సంస్థలు సీఎస్ఆర్ నిధుల కింద కొంత మొత్తాన్ని సామాజిక బాధ్యత కింద ఖర్చు చేయాల్సి ఉందన్నారు. ఇందులో భాగంగానే నేడు ఈ నిధులను కేటాయించారన్నారు. దీనిపై ఏఐటీయూసీ, సీపీఐ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వారి వాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కదిలిన అధికార యంత్రాంగం

సాక్షి ఎఫెక్ట్..

చెన్నూర్: చెన్నూర్ మున్సిపాలిటీలో సమస్యల పరిష్కారమే లక్ష్యంగా 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఫోన్‌ఇన్'లో మున్సిపల్ కమిషనర్ గంగాధర్‌కు ప్రజలు తమ సమస్యలు ఏకరువు పెట్టిన విషయం తెలిసిందే. స్పందించిన అధికారులు ఆదివారం పలు వార్డుల్లో యుద్ధప్రాతిపదికన పారిశుధ్య పనులు నిర్వహించారు. సోమవారం కమిషనర్ గంగాధర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్ 5, 15 వ వార్డుల్లో సందర్శించారు. 5వ వార్డులోని ఇందిరానగర్, కుమ్మరిబొగుడ కాలనీల్లో డ్రైయినేజీలు శుభ్రం చేయించారు. 15 వార్డులో ఓపెన్ ప్లాట్‌లో ఉన్న చెత్తను ట్రాక్టర్ ద్వారా తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఫోన్‌ఇన్‌లో ప్రజలు విన్నవించిన సమస్యలు పరిష్కరించేందుకు షెడ్యూల్ తయారు చేశామన్నారు. కార్యక్రమంలో 5వ వార్డు కౌన్సిలర్ నమీమాబేగం, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



డ్రైయినేజీ శుభ్రం చేయిస్తున్న అధికారులు

డ్రైయినేజీల్లో పూడిక తీత

సాక్షి ఎఫెక్ట్..

బెల్లంపల్లి: 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించిన ఫోన్‌ఇన్‌కు వచ్చిన ఫిర్యాదులపై రెండు రోజులుగా బెల్లంపల్లి మున్సిపాలిటీలో పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మున్సిపల్ కమిషనర్ ఎన్.వెంకటేశ్వర్లు ప్రత్యేక చొరవ తీసుకుని వార్డుల వారీగా వచ్చిన సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టారు. సోమవారం పాతబస్టాండ్ ఏరియా ఆక్స్‌ఫర్డ్ స్కూల్ ముందు డ్రైయినేజీలో పూడిక తీయించి మురికి నీరు ప్రవహించేలా చర్యలు తీసుకున్నారు. 18 వార్డు పరిధిలో నిల్వ చేసిన చెత్త కుప్పలను డంప్‌యార్డుకు తరలించారు. ప్రగతి జూనియర్ కళాశాల పక్కన మురికినీటి కాలువలో పూడిక తీయించారు.



పూడిక తీస్తున్న పారిశుధ్య సిబ్బంది

నెలాఖరులోగా లక్ష్యం చేరుకోవాలి

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే
- వనమహోత్సవంపై అధికారులతో సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్: వనమహోత్సవం కార్యక్రమం లక్ష్యాన్ని నెలాఖరులోగా చేరుకోవాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్ట ర్ దీపక్ తివారి, ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి వనమహోత్సవ కార్యక్రమంపై సోమవారం సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ వనమహోత్సవం కింద జిల్లాలో 53 లక్షల మొక్కలు నా టాలని లక్ష్యంగా నిర్దేశించామని, ఇప్పటివరకు 45 శాతం పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ శాఖలకు కేటాయించిన లక్ష్యాన్ని వేగంగా పూర్తి చేయాలన్నారు. పురపాలక సంఘాలు, గ్రామ పంచాయతీల వారీగా నాటేందుకు అవసరమై న మొక్కలు అందుబాటులో ఉన్నాయని తెలి పారు. విస్తారంగా వర్షాలు కురుస్తున్నందున పారిశుధ్య చర్యలపై దృష్టి సారించాలన్నారు. ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వ శాఖల వారీగా చేపట్టే సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు, శాఖల వారీగా ఉద్యోగుల ఖాళీల వివరాలతో నివేదిక రూపొందించి జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారికి అందించాలని ఆదేశించారు. సమావేశంలో అధికారులు పాల్గొన్నారు.

జలదిగ్బంధంలో వేమనపల్లి



పడవలో అట్టలొర్రె దాటుతున్న వైద్యసిబ్బంది

వేమనపల్లి: ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదతో ప్రాణహిత నది పోటెత్తి ప్రవహిస్తోంది. ప్రధాన రహదారులను వరద ముంచెత్తడంతో దారులన్నీ జలదిగ్బంధమయ్యాయి. వేమనపల్లి–సుంపుటం గ్రామాల మధ్య ఉన్న ఆర్అండ్‌బీ రోడ్డు, అట్టలొర్రె వంతెన పూర్తిగా మునిగిపోవడంతో గ్రామస్తులు పడవల సాయంతో దాటుతున్నారు. జాజులపేట సమీపంలోని అంకన్న ఒర్రెవంతెన, రోడ్డు మునిగిపోయాయి. వేమనపల్లి సమీప ప్రాణహిత పుష్కరఘాట్ రోడ్డుతో పాటు ఎంచపాయ వైపు రోడ్డు పూర్తిగా నీట మునిగింది. ముల్కలపేట–రాచర్ల మధ్య ఉన్న బొందచేను ఒర్రె హైలెవల్ వంతెన పైకి వరద పోటెత్తడంతో అప్రోచ్‌రోడ్డు కొంతమేర కృంగిపోయింది. నీల్వాయి ఎస్సై శ్యాంపటేల్ ఈ రోడ్డు మార్గంలో రాకపోకలు నిలిపివేశారు. వేమనపల్లి పీహెచ్‌సీకి చెందిన హెల్త్ అసిస్టెంట్ లింగన్న, ఏఎన్ఎం రాజ్యలక్ష్మి పడవతో అట్టలొర్రే దాటి సుంపుటం గ్రామానికి వెళ్లి గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. లోతట్టు గ్రామాలైన వేమనపల్లి, కేతన్‌పల్లి, కల్మలపేట, రాచర్ల, గొర్లపల్లి, సుంపుటం, జాజులపేట, ముక్కిడిగూడం, కళ్లంపల్లి శివారులో సుమారు 2,500 ఎకరాల్లో పత్తి పంటలు నీటమునిగాయి.

ఉధృతంగా ప్రవహిస్తున్న 'ప్రాణహిత'

కోటపల్లి: ఇటీవల కురుస్తున్న వర్షాలకు ప్రాణహిత నది ఉప్పొంగి ప్రవహిస్తుండడంతో వెంచపల్లి, జనగామ, సుపాక, ఆలుగామ, ఆ న్నారం గ్రామాల్లోని పత్తి చేన్లు నీటమునిగా యి. 18 గ్రామాల్లోని 864 ఎకరాల్లో పత్తి పంట నీటమునిగినట్లు ఏవో మహేందర్, ఏఈవోలు అనుష, వైష్ణవి వివరించారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.



వెంచపల్లిలో నీటమునిగిన పత్తి చేను

సాక్షి పేపర్ చదివిస్తూ.. ప్రాక్టీస్ చేయిస్తూ..!



ప్రాక్టీస్ చేస్తున్న విద్యార్థులు

మంచిర్యాలఅర్బన్: పట్టణంలోని హరిజనవాడ పాఠశాలలో చదివే విద్యార్థులకు తెలుగులో సులువుగా అర్థమయ్యేలా పాఠశాల ఉపాధ్యాయుడు రాజాబాబు ఆలోచన చేశారు. రోజూ పేపర్‌లో వచ్చే వార్తలు చదివించడంతో పాటు శీర్షికలో వచ్చే కథనాలను ప్రాక్టీసు చేయిస్తున్నారు. సులువుగా తెలుగు రావడంతో పాటు విద్యార్థులకు విలువైన సమాచారం (న్యూస్) తెలుస్తుందని ఉపాధ్యాయుడు పేర్కొన్నారు.

ఉప్పొంగిన ప్రాణహిత.. మునిగిన పంటలు



మొట్లగూడ సమీపంలోకి వచ్చిన ప్రాణహిత వరద

దహెగాం/పెంచికల్‌పేట్/చింతలమానెపల్లి: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో ప్రాణహిత నది ఉప్పొంగి పరీవాహక ప్రాంతాల్లోని పంట చేలు నీట మునిగాయి. పెద్దవాగు కూడా ఉధృతంగా ప్రవహిస్తుండటంతో దహెగాం మండలంలోని మొట్లగూడ వరకు వరద చేరింది. మొట్లగూడ, రావులపల్లి, రాంపూర్ సమీపంలో సుమారు 1050 ఎకరాల్లో పత్తి పంట నీట మునిగిందని రైతులు తెలిపారు. ఏఈవో దీపక్ దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. పెంచికల్‌పేట్ మండలం నందిగామ, జిల్లెడ, మురళీగూడ గ్రామాల్లో సుమారు 300 ఎకరాల్లో వరి, పత్తి, కంది పంటలు నీటమునిగాయి. నందిగామ గ్రామానికి వెళ్లే రహదారి వరద నీటితో మునిగింది. చింతలమానెపల్లి మండలం గూడెం, దిందా, కోయపెల్లి, బూరుగూడ గ్రామాల సమీపంలో పంట భూముల్లోకి వరద చేరింది. కోయపెల్లి సమీపంలోని వంతెన వద్ద రహదారి ముంపునకు గురైంది. గూడెం, కోయపల్లి నుంచి బెజ్జూర్ మండలంలోని పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.



నందిగామ వద్ద పంట చేలలోకి చేరిన వరద



నీట మునిగిన పత్తి పంటను చూపుతున్న రైతు

ఆర్టీసీకి పెరిగిన ప్రజాదరణ

- ఉమ్మడి జిల్లాలో 3.57 కోట్ల మందికి 'జీరో' టికెట్లు
- ప్రయాణికుల సంఖ్యకనుగుణంగా బస్సులు
- కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక దృష్టి
- రీజినల్ మేనేజర్ సోలోమాన్

కైలాస్‌నగర్: ఆర్టీసీకి ప్రజల్లో ఆదరణ పెరిగిందని దీంతో ఆక్యుపెన్సీ రేషియో(ఓఆర్) 90శాతం నమోదవుతుందని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సోలోమాన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం గతేడాది డిసెంబర్‌లో మహాలక్ష్మి పథకం అమలు చేసినప్పటి నుంచి ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేవారి సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. రీజియన్‌లోని ఆరు డిపోల పరిధిలో 612 బస్సులుండగా నిత్యం 2.70 లక్షల మంది ప్రయాణికులు ప్రయాణిస్తున్నారన్నారు. ఇందులో 1.50 లక్షల మంది మహిళలు ఉంటున్నట్లుగా తెలిపారు. కొన్ని బస్సుల్లో 95 నుంచి 100శాతం ఓఆర్ నమోదవుతుందన్నారు. మహాలక్ష్మి పథకం ప్రారంభం నుంచి గడిచిన 218 రోజుల్లో 3కోట్ల 57లక్షల 54వేల 336 మంది మహిళలు ప్రయాణించగా వారికి జీరో టికెట్లు జారీ చేశామన్నారు. అలాగే డబ్బులు చెల్లించి 2కోట్ల 50లక్షల 59వేల172 మంది ప్రయాణించినట్లుగా తెలిపారు. ప్రయాణికుల సంఖ్యకనుగుణంగా బస్సులను నడుపుతున్నట్లుగా తెలిపారు. గతంలో కిలో మీటర్‌కు రూ.43.20 ఆదాయం రాగా, మహాలక్ష్మి అమలు నుంచి కిలో మీటర్‌కు రూ.57.28 ఆదాయం వస్తుందని చెప్పారు. ఆర్టీసీ కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తు గ్రాండ్ హెల్త్ చాలెంజ్ ట్రూ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లుగా తెలిపారు. ఇందులో భాగంగా కార్మికులకు ఆరోగ్య పరిక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆదిలాబాద్, మంచిర్యాలలోని డిస్పెన్సరీల్లో వైద్యసేవలందిస్తున్నట్లుగా తెలిపారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తార్నాకలోని ఆసుపత్రికి పంపిస్తున్నట్లుగా పేర్కొన్నారు. అక్కడ కొత్తగా ఎంఆర్ఐ, ఐసీయూ సేవలు కూడా అందుబాటులోకి వచ్చినట్లుగా తెలిపారు. కార్మికులు ప్రయాణికులతో మర్యాదగా నడుచుకుంటూ మరింత ఆదాయం పెంచేలా శ్రద్ధ వహించాలని కోరారు. ప్రయాణికులు కూడా సంస్థను ఆదరించాలని విజ్ఞప్తి చేశారు.



మాట్లాడుతున్న ఆర్.ఎం.సోలోమాన్